క్లుప్తంగా

పౌష్టికాహారం పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక పెజ్జోనిపేటలోని నీతోడు మానసిక వికాసకేంద్రంలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యాన శనివారం హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధిత కుటుంబాలకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం జరిగింది. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ డాక్టర్ బి.భానూ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులను గుర్తించి వారికి పౌష్టికాహారంతో పాటు ఆర్థిక సహకారం అందిస్తున్న నవజీవన్ బాలభవన్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ తంబీ జోసెఫ్, ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు, పాత ప్రభుత్వ ఆసుపత్రి ఏఆర్టీ కౌన్సిలర్ కనకాల ప్రసాద్, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్స్ నజ్మా, దేవమణి, వాలంటీర్స్ హైమావతి, దుర్గా, రాణి, హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

22 నుంచి కార్తిక మాసోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడులోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో ఈనెల 22 నుంచి వచ్చేనెల 20వ తేదీ వరకు కార్తిక మాసోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దాట్ల వెంకట నరసింహరాజు తెలిపారు. స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం కార్తిక మాసోత్సవాల కరపత్రాల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 వేకువజామున 5 గంటలకు గోపూజ, ప్రథమ అభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 25న నాగుల చవితి పురస్కరించుకుని నాగదోష నివారణకు విశేష అభిషేకాలు, వచ్చేనెల 5న కార్తిక పౌర్ణమి సందర్భంగా లక్ష బిల్వార్చన, నందాదీపసేవ, జ్వాలా తోరణం, 9న రమాసత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు, 18న శాంతి కల్యాణం, 19న మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతాయని వెల్లడించారు. వచ్చేనెల 20న మహా కర్పూర హారతితో మాసోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

వైభవంగా నందీశ్వరునికి రుద్రాభిషేకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాత శివాలయంలో నందీశ్వరునికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. నగరంలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో త్రయోదశని పురస్కరించుకుని ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి మాసంలోనూ త్రయోదశి రోజున నందీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించటం ఆనవాయితీ. అందులో భాగంగా శనివారం సాయంత్రం ప్రదోషకాలంలో నందీశ్వరస్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. విశేష పుష్పాలంకరణ, పంచహారతులు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు.

చిరువ్యాపారిపై టీడీపీ నేతల దౌర్జన్యం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ భవానీపురంలో రోడ్డు పక్కన ఇడ్లీ బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్న ఓ చిరు వ్యాపారిపై అధికార టీడీపీ నేతలు జులుం ప్రదర్శించారు. వివరాల్లోకి వెళితే ... భవానీపురం క్రాంబే రోడ్డులోని శివాలయం సెంటర్‌కు సమీపంలో ఓ ఖాళీ స్థలం ఎదుట రోడ్డు పక్కన ఏడాదిన్నరగా ఇడ్లీ బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. అక్కడ బండి పెట్టుకున్నందుకు ఖాళీ స్థలం యజమానికి ప్రతి నెల రూ.12 వేలు అద్దె చెల్లిస్తున్నాడు. భవానీపురానికి చెందిన అధికార టీడీపీ నేత, మాజీ కార్పొరేటర్, 41వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు పత్తి నాగేశ్వరరావు, 40వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య అతని దగ్గరకు వచ్చి తమకు రూ.60వేలు ఇవ్వాలని, లేదంటే జేసీబీతో బండిని తొలగించి అవతల పడేస్తామని హెచ్చరించారు. తాను రూ.60వేలు ఇవ్వలేనని, రూ.20వేలు, అది కూడా రెండు దఫాలుగా ఇస్తానని వేడుకున్నాడు. అయినప్పటికీ వారు కనికరించలేదు. శుక్రవారం అర్ధరాత్రి ఇడ్లీ బండిని జేసీబీతో తొలగించి రోడ్డుకు అవతల వైపు పడేశారు. శనివారం ఉదయం శివ వచ్చి చూడగా ఇడ్లీ బండి కనిపించలేదు. రోడ్డుకు అవతల వైపు పడేసి ఉండటంతో వెళ్లి చూసుకున్నాడు. జేసీబీతో తొలగించడంతో సామగ్రి పాడైపోయిందని బాధితుడు శివ కన్నీటి పర్యంతమయ్యాడు. వారిద్దరిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తనకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నాడు. పత్తి నాగేశ్వరరావు, చిన్న సుబ్బయ్య కలసి చిరు వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు కూటమి నేతలే చెబుతుండటం గమనార్హం.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో పేదలకు అన్యాయం

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే పేద, మధ్యతరగతి ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుండె సుందర్‌పాల్ ఆధ్వర్యంలో శనివారం 32వ డివిజన్, శాంతినగర్‌లో కోటి సంతకాల సేకరణ ఉద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ చంద్రబాబు పద్నాలుగేళ్ల ముఖ్యమంత్రిగా ఉన్నా రాష్ట్రంలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీని కూడా తీసుకురాలేదని విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల కాలంలోనే రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాలు చేపట్టారని, అందులో ఐదు కాలేజీలు పూర్తికాగా, మరికొన్ని తుదిదశలో ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలను తన బినామీలకు ధారాదత్తం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు.

అందని ద్రాక్షగా ప్రభుత్వ వైద్యం

ప్రైవేటీకరణ చర్యలతో పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షగా మారుతుందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రభుత్వమే నిర్వహించడం వల్ల రాష్ట్రంలో వైద్య నిపుణుల సంఖ్య పెరుగుతుందని తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, ప్రొఫెసర్‌లు, ఎంబీబీఎస్ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు ఇలా ప్రతి దశలోను వైద్యపరంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రైవేటు వ్యక్తులకు వాటిని అప్పగించడం వల్ల వారు కేవలం లాభాన్ని దృష్టిలో పెట్టుకుని వైద్యరంగాన్ని వ్యాపార రంగంగా మారుస్తారన్నారు. ప్రజలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేసి రాష్ట్ర గవర్నరుకు పంపించాలని పిలుపునిచ్చారు. అనంతరం శాంతినగర్‌లో పార్టీ నాయకులతో కలసి మల్లాది విష్ణు స్థానికుల నుంచి సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ కోఆర్డినేటర్ ఒగ్గు గవాస్కర్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం త్రివేణిరెడ్డి, ఎస్సీ సెల్ సెంట్రల్ అధ్యక్షుడు జి.శ్యాంబాబు, నాయకులు జె.వి. రెడ్డి, సువర్ణరాజు, మాల్యాద్రి, అబ్రహం, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ నాయకులు



సంతకాలు సేకరిస్తున్న కార్పొరేటర్ తిరుపతమ్మ



63వ డివిజన్‌లో సంతకాలు సేకరిస్తున్న నేతలు

పేదలకు వైద్యం దూరం చేసేందుకు కుట్ర

పాయకాపురం(విజయవాడరూరల్): మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడమంటే ప్రజలకు సర్కారు వైద్యం దూరం చేయడంలో భాగమేనని 64వ డివిజన్ కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ అన్నారు. కూటమి ప్రభుత్వం తలపెట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శనివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని రాజీవ్‌నగర్, కండ్రిక ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం వల్ల విద్యార్థులకు, ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ విధానాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. పార్టీ నాయకులు యర్రగొర్ల శ్రీరాములు, డివిజన్ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, శేఖర్, కిరణ్, నవీన్, వెంకటేశ్వరమ్మ, చిన్నారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

63వ డివిజన్‌లో సంతకాల సేకరణ

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 63వ డివిజన్‌లో సంతకాల సేకరణ జరిగింది. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పసుపులేటి యేసు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాన్యం జగదీష్, షేక్ హుస్సేన్, జి.రివార్డు, బి.వాణి, లావణ్య కుమార్, టి.శ్యామల పాల్గొన్నారు. అలాగే 61వ డివిజన్‌లో కూడా సంతకాల సేకరణ జరిగింది. డివిజన్ అధ్యక్షుడు నాలం బాబు ఆధ్వర్యంలో శాంతినగర్, హెచ్ బ్లాక్ సెంటర్‌లో ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో వాలంటీర్ వింగ్ అధ్యక్షుడు ఆర్ఎస్ నాయుడు, బాలనాగమ్మ, ఎస్.దుర్గాప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, డి.రాంబాబు, లక్ష్మి, రాజ్యలక్ష్మి, మల్లేశ్వరి, ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ విరమించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం విరమించుకోవాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక 30వ డివిజన్ బుడమేరు మధ్యకట్టలో శనివారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నిర్ణయం వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య, వైద్యం దూరం అవుతాయని విచారం వ్యక్తం చేశారు. దీని వల్ల పేద ప్రజలకు వైద్యం ఖరీదు అవుతుందని అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి సంతకాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామకృష్ణ, మనోహర్, నగర ప్రసాద్, లక్ష్మణ్, ధనుంజయ్, పెద్దబాబు, రాజు, కృష్ణ, రాజారత్నం, ముత్యాలు, ఎస్ దుర్గారావు, పవన్, నాని, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

27వ డివిజన్‌లో...

27వ డివిజన్‌లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి పార్టీ నాయకులతో కలిసి సంతకాలు సేకరించారు. ఆమె మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు శీలం భవానీరెడ్డి, ఆచారి, బుజ్జి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



30వ డివిజన్‌లో సంతకాలు సేకరిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి

కాలుష్య రహిత రాష్ట్రమే లక్ష్యం



కార్యక్రమంలో వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్ మన లక్ష్యమని విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్ అన్నారు. పటమట 45వ డివిజన్ లక్ష్మీనగర్‌లో ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శనివారం ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా నిర్ణీత అంశాలతో ప్రజలకు చైతన్యం కల్పిస్తున్నామని, అక్టోబర్‌లో స్వచ్ఛ వాయువు, మన ఆయువు అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నగర పరిధిలోని మూడు జోనల్ కార్యాలయాల్లో కూడా స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ఎన్నో కాలుష్య రహిత చర్యలు తీసుకుంటోందని, ప్రజలు కూడా వాయు కాలుష్యం తగ్గించేందుకు పర్యావరణ హితమైన రవాణాను ఎంచుకోవాలని, పర్యావరణంలో మనం ఎంత కాలుష్యం తగ్గిస్తామో మనం అంత ఆరోగ్యంగా ఉంటామన్నారు. అనంతరం సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ ఇంజినీర్ ఆర్.ప్రభాకర్ రెడ్డి, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ కె.చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి.వెంకటనారాయణ, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఎనలిస్ట్ (ఏపీ పొల్యూషన్ బోర్డ్) సారథి, వన్ ఎర్త్ – వన్ లైఫ్ ఎన్‌జీఓ కమలాకర్, భాష్యం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధపై అవగాహన అవసరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న 2వ అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్

విజయవాడలీగల్: న్యాయవాదులు అందరూ కృత్రిమ మేధ(ఏఐ)పై అవగాహన పెంచుకోవాలని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కె. బాషా పేర్కొన్నారు. ది ఏపీ అడ్వకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, బీబీఏ సంయుక్తంగా ఏఐపై ఒకరోజు అవగాహన సదస్సును బెజవాడ బార్ అసోసియేషన్ ఆవరణలోని కె.ఎల్.రావు భవన్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎ.కె. బాషా, 2వ అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్ అధ్యక్షత వహించగా, చైర్మన్ సంపర దుర్గా శ్రీనివాసరావు, కార్యదర్శి కె.వకుళాదేవి ఆధ్వర్యంలో జరిగింది. బాషా మాట్లాడుతూ గతంలో జూనియర్ న్యాయవాదులు ప్రతి డ్రాఫ్టింగ్ కోసం సీనియర్ న్యాయవాదులపై ఆధారపడేవారని, ఇప్పుడు కృత్రిమ మేధ సాయంతో వారి డ్రాఫ్టింగ్‌ను వారే సొంతంగా చేసుకోగలుగుతున్నారని తెలిపారు. అలాగే ఇంగ్లిష్‌ను కూడా అభివృద్ధి చేసుకోవడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సత్యానంద్ మాట్లాడుతూ జడ్జిమెంటు 15 పేజీలు ఉంటే, మనం క్లుప్తంగా తెలుసుకునేందుకు కృత్రిమ మేధ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన బాషాను అభినందించారు. ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస చక్రవర్తి కృత్రిమ మేధపై మెళుకువలు వివరించారు. కార్యక్రమంలో 12వ అదనపు జిల్లా జడ్జి సునీల్‌కుమార్, 200 మంది న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆత్మరక్షణ నైపుణ్యాలపై శిక్షణ



ఏకేటీపీ హైస్కూల్‌లో తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ శిక్షణలో విద్యార్థినులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్వర్ణాంధ్ర – 2047 విజన్‌లో భాగంగా పీ4 విధానంలో ఆడపిల్లల ఆత్మరక్షణ నైపుణ్యాలపై ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు. అందులో భాగంగా శనివారం సత్యనారాయణపురంలోని ఏకేటీపీ హైస్కూల్‌లో గుణాదిత్య ఇంటిగ్రల్ ఫౌండేషన్, ఎన్టీఆర్ జిల్లా తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ టీమ్ సంయుక్త ఆధ్వర్యంలో బాలికలకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ టీమ్ నిపుణులు కఠిన పరిస్థితులను ఎదుర్కోవడం, అవాంఛనీయ సంఘటనల నుంచి తమను తాము కాపాడుకోవడం వంటి సెల్ఫ్ డిఫెన్స్ పద్ధతులను నేర్పించారు. ఈ సందర్భంగా గుణాదిత్య ఇంటిగ్రల్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలు ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో జీవించడానికి ఆత్మరక్షణ నైపుణ్యాలు ఎంతగానో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమం కేవలం శిక్షణ ఇవ్వడానికే కాకుండా, ఆడపిల్లలందరిలోనూ భయాన్ని పోగొట్టి, ధైర్యాన్ని నింపడానికి ఉద్దేశించినదిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ టీం ప్రత్యేక అధికారి కె.పోసిబాబు, ఉపాధ్యాయులు, జిల్లా తైక్వాండో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కొల్లూరి సాహితీ సేవలు ఆదర్శం



కొల్లూరి సంస్మరణ సభలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ సభ్యులు, సాహితీవేత్తలు

విజయవాడ కల్చరల్: కొల్లూరి సాహితీ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని కామ్రేడ్ జీఆర్‌కే సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు పేర్కొన్నారు. విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యాన గవర్నర్‌పేటలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ కార్యాలయంలో శనివారం సాహితీవేత్త, సంపాదకుడు కొల్లూరి సంస్మరణ సభను నిర్వహించారు. గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ కొల్లూరిని నిత్య సాహితీసేవకునిగా అభివర్ణించారు. కవి సత్రీ మాట్లాడుతూ ఎందరో యువ కవులకు స్ఫూర్తిగా నిలిచినట్లు తెలిపారు. నెలనెలా వెన్నెల కార్యక్రమం ద్వారా ఎందరో యువ కవులకు వేదిక కల్పించినట్లు గుర్తుచేశారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు మనోహర్ నాయుడు, కార్యదర్శి పి.లక్ష్మయ్య మాట్లాడుతూ కొల్లూరి బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారని అన్నారు. సాహితీ సంస్థల ప్రతినిధులు బోడి ఆంజనేయరాజు, నండూరి రాజగోపాల్, కవులు అరసవిల్లి కృష్ణ, చలపాక ప్రకాష్, శర్మ, శింగపల్లి అశోక్ కుమార్, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ వెన్నా వల్లభరావు, హైమావతి, పోపూరి పుష్పాదేవి, మందరపు హైమావతి, పరుచూరి అజయ్ కుమార్, కళాసాగర్, డాక్టర్ యశోపూర్ణచంద్రరావు, కె. ఆంజనేయకుమార్ కొల్లూరితో అనుబంధం పంచుకున్నారు. ముందుగా కొల్లూరికి శ్రద్ధాంజలి ఘటించారు.

అన్నప్రసాదం నాణ్యతపై ప్రతి రోజూ నివేదిక

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు అందించే అన్నప్రసాద నాణ్యతపై ప్రతి రోజూ నివేదిక ఇవ్వాలని దుర్గగుడి ఈఓ శీనానాయక్ ఆలయ అధికారులను ఆదేశించారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న అన్నప్రసాద వితరణను శనివారం ఈఓ, ఇతర అధికారులు పరిశీలించారు. తొలుత మహా మండపం మూడో అంతస్తుకు చేరుకున్న ఆయన, ఏసీ రంగారావు, ఈఈ రాంబాబు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులతో మాట్లాడారు. అన్నప్రసాదం కోసం ఎంత సేపటి నుంచి క్యూలైన్‌లో వేచి ఉన్నారని ఆరా తీశారు. భక్తులకు పంపిణీ చేసే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించడంతో పాటు రుచిని చూసేందుకు భక్తులతో కలిసి భోజనం చేశారు. భక్తులకు సరిపడేలా అన్నప్రసాదం అందించాలని, భోజనాలు పూర్తయ్యే లోగా ప్రతి రోజు నాణ్యతపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మెట్ల మార్గం ద్వారా కొండ దిగువకు చేరుకున్నారు. మెట్ల మార్గం వద్ద భక్తులకు తగినన్ని బెంచీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

త్వరలో వర్సిటీ కార్యకలాపాలు ప్రారంభిస్తాం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ విజయభాస్కర్



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్సిటీ కార్యకలాపాలను త్వరలో ప్రారంభించడంతో పాటుగా అడ్మిషన్లు కూడా నిర్వహిస్తామని ఆ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా నియమితులైన ప్రొఫెసర్ విజయభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఈ యూనివర్సిటీ సేవలు నిలిచిపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైందని, అందువల్ల త్వరలో ఏలూరు జిల్లా సమీపంలో యూనివర్సిటీ కార్యకలాపాలను నిర్వహించనున్నట్లు విజయభాస్కర్ తెలియజేశారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో అంబేడ్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్సిటీకి ఓఎస్డీగా వ్యవహరించిన వెలగా జోషి ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విజయ్‌భాస్కర్‌ను కలిసి శనివారం అభినందనలు తెలియజేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు అన్నారు. మూడో శనివారాన్ని పురస్కరించుకొని డీఈవో కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర పేరుతో ప్రాంగణాన్ని శుభ్రపరచడం, మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగ కమిటీల నియామకం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అనుబంధ విభాగ కమిటీలను నియమించారు. ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధికార ప్రతినిధిగా మైలవరం నియోజకవర్గానికి చెందిన గుంజా శ్రీనివాసు నియమితులయ్యారు.

ఎన్టీఆర్ జిల్లా అనుబంధ విభాగ కమిటీలు

బీసీ సెల్ కమిటీ ఉపాధ్యక్షులు మద్దెల పవన్, చెన్ని రాంబాబు, కలసాని చెన్నారావు, ప్రధాన కార్యదర్శులు నాగళ్ల నరసయ్య, ఓర్సు జ్వాలా, కోనాకి ముక్కంటి, పరసా నెహ్రూజీ, కొరగంజి సత్యనారాయణ, పొట్నూరి దుర్గా ప్రసాద్‌తో పాటు 10 మంది కార్యదర్శులు, 8 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.

జిల్లా ఐటీ వింగ్ కమిటీ...

కమిటీ ఉపాధ్యక్షులుగా సీహెచ్ నారాయణరెడ్డి, షేక్ లతీఫ్, ప్రధాన కార్యదర్శులుగా చేతన్‌రెడ్డి, రాఘవరపు వినాయకరావు, మేడా శ్రీనివాసరావు, గుడిసె ప్రభాకరరెడ్డి, పొన్నం కిరణ్, 8 మంది కార్యదర్శులు, 14 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.

లీగల్ సెల్ కమిటీ..

జిల్లా ఉపాధ్యక్షులుగా మందపాటి బసవారెడ్డి, అత్తలూరి ప్రభాకరరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా బెజవాడ భిక్షమయ్య, కొమ్ముకూరి చంటిబాబు, గోగిరెడ్డి కృష్ణారెడ్డి, తోట శ్రీనివాసరావు, అల్లా భక్షు, 8 మంది కార్యదర్శులు, 9 మంది కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు.

జిల్లా మహిళా విభాగ కమిటీ

ఉపాధ్యక్షులుగా ఇందుపల్లి సుభాషిణి, ఎండీ సల్మా సుల్తానా, ప్రధాన కార్యదర్శులుగా బచ్చు మాధవి, తుమ్మలపల్లి శ్రీదేవి, ఉప్పట్ల వెంకట లక్ష్మి, కొండ పద్మ, బండారి పద్మావతి, వద్దాది అనిత, 8 మంది కార్యదర్శులు, 13 మంది కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు

జిల్లా ఎస్సీ విభాగ కమిటీ

ఉపాధ్యక్షులుగా కుక్కల శ్రీధర్, తాండ్ర ఇంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శులుగా అంబడిపూడి శేఖర్‌బాబు, కోట పుల్లారావు, జంగం కాశేశ్వరరావు, నల్లమోతు దుర్గారావు, పిల్లి జయరాజు, 12 మంది కార్యదర్శులు, 13 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.

విజయవాడ తూర్పు నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు...

గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా తిరువూరు బాజీ కరీముల్లా, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా రజనీ సుధాకర్, ఆర్టిసన్ సెల్ అధ్యక్షుడిగా యడవల్లి ఖాజా రహంతుల్లా, ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడిగా బత్తుల నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది.

ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నమెంట్‌లో రైల్వే ఉద్యోగుల ప్రతిభ



ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నమెంట్‌లో టైటిల్ గెలుచుకున్న రాజేంద్రప్రసాద్, సంపత్‌కుమార్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ఉద్యోగులు ప్రతిభ చాటుకున్నారు. శుక్రవారం విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన ఈ ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్ డబుల్స్ 45 ప్లస్ విభాగంలో రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ అడిషనల్ రిజిస్ట్రార్ కె.రాజేంద్రప్రసాద్, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్‌లో టెక్నీషియన్ సంపత్‌కుమార్ రైల్వే జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో తమ సమీప ప్రత్యర్థులైన గంజి వెంకటేశ్వర్లు, శంకర్ నాయుడులపై అత్యుత్తమ ఆట తీరు కనపర్చి టైటిల్ సాధించారు. వీరితో పాటుగా మరో రైల్వే ఉద్యోగి ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు, శివ 55ప్లస్ విభాగంలో రన్నరప్‌గా నిలిచారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు, సహచర ఉద్యోగులు వారికి అభినందనలు తెలియజేశారు.

ఎస్ఎంసీలో ధన్వంతరి జయంతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో శనివారం ధన్వంతరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావుతో పాటు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధన్వంతరి జయంతి ప్రాశస్త్యాన్ని ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు విద్యార్థులకు వివరించారు.

న్యాయవాదిపై దాడి కేసులో ఇరువురికి జైలు

విజయవాడలీగల్: విజయవాడకు చెందిన న్యాయవాది సోగాని రమేష్ కుమార్‌తోపాటు పాము రమేష్‌పై దాడి చేసిన కలపాల రాధాకృష్ణ, జువ్వనపూడి ఆనంద్‌బాబు ఇరువురికి జైలుశిక్ష విధిస్తూ బంటుమిల్లి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. 2019 జూన్ 23వ తేదీన న్యాయవాది రమేష్ జయపురం కాంప్లెక్స్ రోడ్డులో చెరువులను శుభ్రం చేసేందుకు పాము రమేష్‌ను తీసుకొనివెళ్లారు. చెరువులో రమేష్ కొబ్బరి ఆకులు ప్రోగుచేస్తుండగా, లోగడ ఆ చెరువు లీజుకు తీసుకున్న కలపాల రాధాకృష్ణ అక్కడకి వచ్చి న్యాయవాదితో గొడవపడి దాడి చేస్తుండగా పాము రమేష్ అడ్డుకున్నాడు. కలపాల రాధాకృష్ణతోపాటు కలపాల శ్రీను, జువ్వనపూడి ఆనంద్‌బాబు వారిరువురిపై కర్రలతో దాడిచేశారు. ఈ దాడిలో పాము రమేష్ తలకు గాయం, రమేష్‌కుమార్‌కి కాలికి గాయాలయ్యాయి. పాము రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంటుమిల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ గంగామణి ఏడుగురు సాక్షులను విచారించారు. నిందితుల్లో ఒకరైన కలపాల శ్రీను 2023 మే 14న చనిపోగా, మిగిలిన ఇరువురి నిందితులపై నేరం రుజువైనందున రాధాకృష్ణకు 5 నెలలు జైలు, రూ. 3వేల జరిమానా విధిస్తూ, జరిమానా కట్టలేని పక్షంలో మరో 15 రోజుల సాధారణ జైలు, అలాగే జువ్వనపూడి ఆనంద్‌బాబుకు 3 నెలలు జైలుశిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ ఎం.భాస్కరరావు తీర్పునిచ్చారు.